క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: దోనుబాయి పీహెచ్‌సీ పరిధిలో సీతంపేట గ్రామ సచివాలయం – 1 ఆశా కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్టు డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం పదో తరగతి చదివి ఉండాలన్నారు. ఇంటర్మీడి యెట్ అర్హత ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వను న్నట్టు పేర్కొన్నారు. జూన్ 2వ తేదీలోగా అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మంతినవలసలో ఫ్యామిలీ డాక్టర్


శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శంకరరావు

కురుపాం: మంతినివలస గ్రామంలో రామభ ద్రపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ మెడికల్ క్యాంప్ (104) శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి చీకటి శంకరరావు 65 మంది రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. బీపీ, షుగర్ మాత్ర లను తప్పనిసరిగా వాడాలని, తీవ్రమైన ఎం డల వలన జాగ్రత్తలు పాటించాలని సూచిం చారు. శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పి పి.జాకబ్, ఏఎన్‌ఎంలు నిర్మల, పద్మ, ఆశ వర్కర్లు, సిహె చ్‌డబ్ల్యూలు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం, చీరల పంపిణీ


బియ్యం, చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: స్థానిక పీఎంఆర్‌సీ సెంటర్‌కు సమీ పంలో పేదలకు పాలకొండ ఎమ్మెల్యే విశ్వాస రాయి కళావతి చేతుల మీదుగా శుక్రవారం బియ్యం, చీరలు పంపిణీ చేశారు. వీటిని సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమం లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాము తది తరులు పాల్గొన్నారు.

సవర భాషపై వేసవి శిక్షణ తరగతులు


సవర భాష కృత్యాలు చేస్తున్న ఆదివాసీ విద్యార్థులు

భామిని: మండలంలోని సతివాడ సమీపంలో అక్షరబ్రహ్మ ఆశ్రమంలో ఆదివాసీ పిల్లలకు సవర భాష శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నూకాలమ్మగూడలోని అక్షరబ్రహ్మ యువ నిర్మాణ సేవా సంఘం జిల్లా కో ఆర్డినేటర్ సవర కరువయ్య పర్యవేక్ష ణలో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభిం చారు. సవర భాషపై వివిధ తరగతుల విద్యా ర్థులకు సవర లిపిపై పట్టు సాధించేలా సాధన చేయించారు. సవర భాషలో పదాలు, గుణిం తాలు, కథలు, వాక్యాలు రాసే విధానాన్ని వివరించారు. పదాలకు తగిన విధంగా చిన్నా రులకు కృత్యాలు చేయించారు. సవర భాషలో కథలు చెప్పించారు. ఆటలు ఆడించారు. ఆశ్రమం కంప్యూటర్ ఆపరేటర్ సవర గంగా రాం, అక్షర బ్రహ్మ ప్రచారకులు, ఆదివాసీ విద్యార్థులు పాల్గొన్నారు.

గురండిలో దేవుడి పెళ్లి


చంద్రశేఖరస్వామిని ఊరేగిస్తున్న గురండి గ్రామస్తులు

భామిని: మండలంలోని గురండి గ్రామంలో వెలసిన శ్రీచంద్రశేఖర స్వామి కల్యాణం, చక్ర తీర్థ స్నానాలు శుక్రవారం నందడిగా నిర్వహిం చారు. గురండిలో వెలసిన పురాతన ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కల్యాణ మండపంపై దేవుని పెళ్లిగా పిలిచే చంద్రశేఖరస్వామి, దుర్గా దేవీల కల్యాణం ఉత్కళ సాంప్రదాయంలో చేపట్టారు. అనంతరం పల్లకిలో ఉత్సవ విగ్ర హాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి నేరడి బీ వం శధార నదిలో చక్రతీర్థ స్నానాలు చేయించారు. ఒడిశా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివ చ్చారు.

సారా పట్టివేత

పాలకొండ రూరల్: మండలంలోని అవలంగి గ్రామ సమీపంలో 10 లీటర్ల సారా తరలి స్తున్న బొమ్మాళి రాయప్పను శుక్రవారం పాల కొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద ఉన్న సారాను సీజ్ చేయటంతో పాటు నిందితునిపై కేసు నమోదు చేసి రిమాం డ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ బి.శివప్రసాద్ తెలి పారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

• ఎమ్మెల్యే కళావతి


పీవీఆర్ పురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే కొల మానంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తు న్నామని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వీరఘట్టం మండలం పీవీఆర్ పురంలో శుక్రవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో ఎమ్మెల్యే కళావతి పాల్గొన్నారు. ప్రతీ గడపకు అందుతున్న సంక్షేమ పథకాలపై అధికారులను ఆరా తీశారు. పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమ న్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలవుతున్న సం క్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా అమల వ్వడం లేదనాన్నరు. ఇళ్లు లేని ప్రతీ పేదవాడికి సొం తింటి కలను సాకారం చేస్తూ సుపరిపాలన అంది స్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పెన్నిధిగా నిలిచారన్నారు. గ్రామంలో ఉన్న 250 కుటుంబాలను గడప గడపకు మన ప్రభుత్వం కార్య క్రమం ద్వారా సందర్శించి ప్రభుత్వ పథకాలను వివ రించారు.

జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించండి

ప్రజా సంక్షేమం కోసం,పేదల అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదిం చాలని ఎమ్మెల్యే కళావతి కోరారు. 2024లో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజా ర్టీతో గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పాలనను చూడలేని ప్రతిపక్షంతో కూడిన పచ్చదండును తరిమికొడ దామని ఎమ్మెల్యే కళావతి అన్నారు. పేదల కోసం పోరాడాల్సిన ప్రతిపక్షం, రాష్ట్రంలో జరుగుతున్న పేదల అభ్యున్నతిని అడ్డుకుంటోందని ఎమ్మెల్యే కళావతి ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి నీచ రాజకీయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచే స్తున్న టీడీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, సర్పంచ్ ఉదయాన జగన్, జెడ్పీటీసీ జంపు కన్నత ల్లి, ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన

• ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి


నవరత్నాలపై వివరిస్తున్న, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: రాష్ట్రంలో పారదర్శక పాలన అందించే ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండ లంలోని చినగుడబ గ్రామంలో శుక్రవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామ స్తులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ మేరకు ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రభుత్వంలో గత నాలుగేళ్లుగా అమలు చేస్తున్న నవరత్నాల పథకా లపై వివరించారు. సంక్షేమ పథకాలతో పేదల ఇం ట ఆనందం వెల్లివిరిస్తుందన్నారు. ప్రతీ పేదవాటి ఇంట సంతోషాలు చూడాలన్న లక్ష్యంతోనే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆర్థిక లోటులోను పథకాలను కొనసాగిస్తున్నారన్నారు. సచివాలయం, వలం టీర్లు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌లు పెట్టి ప్రజల చెం తకే ప్రభుత్వ సేవలు తీసుకువచ్చిన గొప్ప నేత జగ న్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఏ గడపకు వెళ్లినా ఆనందంతో స్వాగతిస్తున్నారంటే అందుకు ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాలే కారణమ న్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారు సుఖసంతోషా లతో ఉన్నారని, మళ్లీ రాష్ట్రంలో జగనన్న పాలన రావాలని కోరుకుంటున్నారన్నారు. ఎంపీపీ, మం డల కన్వీనర్ ఉరిటి రామారావు ఆధ్వర్యంలో జరి గిన కార్యక్రమంలో నాయకులు మూడడ్ల అప్పా రావు, డి.పాపినాయుడుతో పాటు పలువురు సర్పం చ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొ న్నారు.

బాధిత కుటుంబానికి అండగా 'రెడ్‌క్రాస్'



బాధిత కుటుంబ సభ్యులకు సరుకులు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

కురుపాం: బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ సొసైటీ అండగా నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.. కురుపాం మం డల కేంద్రంలోని మంతినివలస కాలనీలో నివాస ముంటున్న బచ్చల మోహన్‌రావు ఇల్లు మూడు రోజుల కిందట షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ మంచిపల్లి శ్రీరాములు, కార్యదర్శి బి.నాగభూషణరావు, జిల్లా కో ఆర్డినేటర్ వై.జనార్ద నరావు బాధిత కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి శుక్ర వారం వంట సామగ్రి, నిత్యావసర సరుకులు, టార్పాలిన్ తదితర వినియోగ వస్తువులను అందజే శారు. అధైర్య పడవద్దని అండగా ఉంటామని తెలి పారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, స్థానిక వర్తక సంఘం నాయకులు బరాటం గుం పస్వామేశ్వరరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకోట వెంకట సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు కిమ్మిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వీరఘట్టం: మండలంలోని కిమ్మి గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిం చనున్నట్లు ఎంపీడీఓ వై.వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావ తి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 3 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనాలని కోరారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి


తాగునీటి బావిలో క్లోరినేషన్ చేస్తున్న ఎంపీడీఓ

గరుగుబిల్లి: పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామ సచివాలయ సిబ్బందికి ఎం పీడీఓ జి.పైడితల్లి ఆదేశించారు. మండలంలోని పెద్దూరు గ్రామంలో ఫ్రైడే, డ్రైడే సందర్భంగా ప్రజ లకు పారిశుద్ధ్యంపై శుక్రవారం అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా కాలువలు శుభ్రపరచడంతో పాటు తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేలా ప్రతీ ఒక్కరు ఇంటి ముందు మురుగు నిల్వలు వ్యాప్తి చెందకుండా దృష్టి సారిం చాలన్నారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపర చడంతో పాటు క్లోరినేషన్ చేపట్టాలన్నారు. లేదంటే దోమలు వ్యాప్తి చెంది మలేరియా తదితర వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. అనంతరం సిటిజన్ ఔట్‌రీచ్ సర్వేను పరిశీలించారు. సంక్షేమ పథకాలకు అర్హులు ఎవరైనా సాంకేతిక కారణాలతో తప్పిపోతే వాటిని పునరుద్ధరించేందుకు సిటిజన్ ఔట్ రీచ్ సర్వే దోహదం చేస్తుందని తెలిపారు. కార్యక్రమం లో ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, సచివాలయ కార్యదర్శి సుభద్రమ్మతో పాటు పలువురు వలం టీర్లు పాల్గొన్నారు.

నాడు – నేడు పనులపై డీఈఓ ఆరా


ఎంఆర్‌సీలో జగనన్న విద్యాకానుక, నాడు – నేడు పనులపై చర్చిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

కురుపాం: స్థానిక ఎంఆర్‌సీకి చేరుకున్న జగనన్న విద్యాకానుక సామగ్రి, పాఠ్య పుస్తకాలను జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ శుక్రవారం పరిశీ లించారు. అనంతరం మండలంలోని నాడు – నేడు కింద పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్ర మాలు ఏ స్థాయిలో ఉన్నది ఎంఈఓ ఎస్.సత్యనారా యణను అడిగి తెలుసుకున్నారు. వచ్చే విద్యా సం వత్సరానికిగాను ప్రతీ పాఠశాలకు సకాలంలో విద్యా కానుకలను అందించేలా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. నాడు నేడు పనుల కూడా చురుగ్గా జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శంకరరావు, సీఆర్‌టీలు పాల్గొ న్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజే స్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు విధిగా తీసుకోవాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. దీంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. మండలంలోని పెద్దూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సంద ర్భంగా స్టాక్ రిజిస్టర్లు, నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న ఆహార పదార్థాలను మెనూ ప్రకారం గర్భిణులకు, బాలింతలకు పెట్టాల న్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రతీ రోజు గుడ్డు, పాలు, ఆకు కూరలు, కాయగూరలతో భోజనం అందించడం జరుగుతుందన్నారు. నిర్దేశించిన మెనూను అమలు చేయకపోతే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఆమె వెంట ఈఓపీఆర్‌డీ గోపాలరావు ఉన్నారు.

పట్టణంలో రీసర్వే ప్రారంభం

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలో శుక్ర వారం నుంచి జగనన్న శాశ్వత భూ హక్కు, భూ సర్వే ప్రారంభించారు. ఇంతవరకు మం డల పరిధిలో చేపట్టిన సర్వే పట్టణంలో ప్రారం భం కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తు న్నారు. 1వ సర్వే నంబర్ నుంచి ప్రారంభించిన సర్వే రైతుల సమక్షంలో చేపడుతున్నారు. మం డల సర్వేయర్ పి.వెంకటరావు ఆధ్వర్యంలో సర్వే సిబ్బంది పనులు చేపట్టారు.


శానిటరీ ఇన్‌స్పెక్టర్ నియామకం

పాలకొండ: నగర పంచాయతీకి శానటరీ ఇన్ స్పెక్టర్‌ను నియమించారు. గత ఐదు సంవత్స రాలుగా ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఇక్కడ పారిశుద్ధ్య పనులు పర్యవేక్షణ కొరవడింది. ఈ నేపథ్యంలో పలాస మున్సిపాలిటీ నుంచి శేఖర్ కుమార్‌ను డిప్యూటేషన్‌పై ఇక్కడ నియమించారు. శుక్ర వారం ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మెరుగైన పారిశుద్ధ్యం కోసం కృషి చేస్తామని తెలిపారు.

డీడీకి అభినందనలు

భామిని: పార్వతీపురం మన్యం జిల్లా దేవ దాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డీవీవీ ప్రసాద రావును జిల్లా జంగం అర్చక సంఘం సభ్యులు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. ధూప దీప నైవేద్య పథకం దరఖాస్తులపై విన్నవించారు. కొత్త రిజిస్ట్రేషన్‌పై చర్చించారు. ఆయనను అభినందించిన వారిలో రాష్ట్ర వర్కిం గ్ ప్రెసిడెంట్ దేవళ్ల ఆనందకుమార్, మన్యం జిల్లా కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుంపస్వామి, మీగడ సంతోష్, విజయనగరం జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు మాస్టారు, కమిటీ సభ్యులున్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు


శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శిరీష

సీతానగరం: ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా గ్రామాల్లో రోగులకు 104 సంచార వైద్య కేం ద్రం ఆవరణలో మెరుగైన వైద్య సేవలు అందిం చగలుగుతున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ శిరీష అన్నారు. ఈ మేరకు సీతానగరం పీహె చ్‌సీ పరిధిలోని అప్పయ్యపేటలో 104 సంచార వైద్యారోగ్యకేంద్రం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానంలో శుక్రవారం ఉచితవైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ గ్రామాల్లో వివిధ రకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో 104 సంచార వైద్య కేంద్రంలో సిబ్బంది సహకారంతో రోగ నిర్ధారణ, వ్యాధి నివారణకు అవసరమైన మం దులు 104 వాహనంలోనే పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఆరోగ్యశ్రీ విధానం ద్వారా వ్యాధి తగ్గుముఖం పట్టి తిరిగి ఆరోగ్యవంతం గా ఇంటికి చేరుకున్న వ్యాధిగ్రస్తులకు స్థానికం గా మందులు అందజేస్తున్నట్లు వివరించారు. వైద్యశిబిరంలో 68 మందికి వైద్యసేవలు అం దించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎ స్సార్‌సీపీ మండల నాయకులు బి సూర్యనా రాయణ, గొరునాయుడు పాల్గొన్నారు.

పాఠశాలలు తెరచిన రోజే విద్యాకానుక కిట్లు

పార్వతీపురం టౌన్: పాఠశాలలు తెరిచిన రోజే విద్యాకానుక కిట్లు అందజే యాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి విష్ణుచరణ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని డీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యాకానుక కిట్లు, పాఠ్య పుస్తకాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నాటికి పుస్తకాలతో పాటు సామగ్రి సక్రమంగా ఉండాలని సూచించారు. పుస్తకాల పంపిణీలో ఎటువంటి అలసత్వం లేకుండా చర్యలు చేప ట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈఓ ప్రేమ్‌కుమార్, పాఠశాల సిబ్బం ది పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

పార్వతీపురం టౌన్: మున్సిపల్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు పురపాలక సంఘం సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు మున్సి పల్ కమిషనర్ రామప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోనెల గౌరీశ్వరి అధ్యక్షతన నిర్వహిస్తామని కౌన్సిల్ సభ్యులంతా హాజరుకా వాలని పిలుపునిచ్చారు.

నేత్ర చికిత్సకు అవ్వాతాతల తరలింపు


నేత్ర చికిత్సలకు అవ్వాతాతలను తరలిస్తున్న వైద్య సిబ్బంది

కురుపాం: వైఎస్సార్ అవ్వాతాత కంటి వెలుగు కార్య క్రమంలో భాగంగా కురుపాం, గుమ్మలక్ష్మీపురం మం డలాల సచివాలయాల పరిధిలో ఇప్పటికే నిర్వహిం చిన కంటి వెలుగు వైద్య శిబిరాల్లో నేత్ర సమస్యలతో ఇబ్బంది పడుతున్న 48 మందిని గుర్తించినట్లు నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి వారిని విజయనగరం పుష్పగిరి ఆస్పత్రికి నేత్ర చికిత్సల కోసం తరలించినట్లు తెలిపారు. వీరికి ఉచితంగా రవాణ, శస్త్ర చికిత్స, భోజన సదుపాయం , ఉచిత కళ్లజోళ్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య సహాయకురాలు రోజా, మల్లిక, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మలేరియాకు చెక్ పెడదాం..



, టిక్కబాయి అంగన్‌వాడీ కేంద్రంలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మలేరియా వ్యాధిని కలుగజేసే దోమల నివారణకు చేపడుతున్న ఏసీఎం 5 శాతం మందును ప్రతీ ఇంట్లో పిచికారీ చేయించుకోవాల ని, తద్వారా మలేరియాకు అడ్డుకట్ట వేద్దామని గుమ్మలక్ష్మీపురం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు అన్నారు. దోమల నివారణకు మొదటి విడత పిచికారీ పనులను మండలంలోని తాడికొండ పీహెచ్‌సీ పరిధిలోని టిక్కబాయి గ్రామంలోని గృహాలతో పాటు, గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేం ద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ మాట్లాడుతూ దోమల నివా రణకు ప్రతీ ఏటా మలేరియా మందును గ్రామాల్లో పిచికారీ చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా పిచికారీ చేయిస్తు న్నట్లు చెప్పారు. ప్రతీ ఒక్కరూ ఇంటా, బయట, ఆవరణల్లో ఈ మందును పిచికారీ చేయించుకోవా లన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీను, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.కాంతి, వైద్య సిబ్బంది నిమ్మకూరి రత్నప్రసాద్, కాంచన పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్ల నాణ్యత పరిశీలన


జగనన్న విద్యాకానుక సామగ్రిని పరిశీలిస్తున్న అధికారులు

కురుపాం: స్థానిక ఆదర్శ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికిగాను విద్యార్థులకు అందజేయనున్న జగనన్న విద్యాకానుక కిట్లు ఇప్పటికే చేరుకోగా వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వి.కిశోర్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం వాటిని పరిశీలించారు. విద్యాకానుకలో ఉన్న స్కూల్ బ్యాగ్స్, యూనిఫాంల నాణ్యత, పాఠ్యపుస్త కాలను సంబంధిత మండల విద్యాశాఖాధికారి ఎస్. సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. పరిశీల నలో ఉపాధ్యాయ సిబ్బంది, సీఆర్‌పీలు పాల్గొ న్నారు.

రాష్ట్రపతిని పిలవకపోవడం శోచనీయం


గుమ్మలక్ష్మీపురంలో కాంగ్రెస్ పార్టీ నిరసన

గుమ్మలక్ష్మీపురం: పార్లమెంట్ నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదిము ర్మును ఆహ్వానించకపోవడం బాధకరమని కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా నాయకుడు నిమ్మక సింహాచలం అన్నారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పిలుపు మేరకు శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలోని డాక్టర్ బీఆర్ అం బేడ్కర్ విగ్రహం వద్ద శాంతియుత నిరసన కార్యక్ర మాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ రాష్ట్రపతిగా ఉన్న గిరిజన మహిళను పార్లమెంట్ నూతన భవ నాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మోదీ ప్రభుత్వం పిలవకపోవడం చూస్తుంటే బీజేపీ కుల రాజకీయాన్ని ఎంతగా ప్రోత్సాహిస్తుందో అర్థమవు తుందన్నారు. గిరిజనుల ఓట్ల కోసమే ఓ గిరిజన మహిళను రాష్ట్రపతిగా నియమించారనేందుకు ఈ సంఘటనే నిదర్శనమన్నారు. కుల రాజకీయాలు, మతాల మధ్య చిచ్చుపెడుతూ, గిరిజనులను అణచివేసేలా వ్యవహరిస్తూ, ప్రజలను ఇబ్బంది లకు గురిచేస్తున్న బీజేపీకి రాష్ట్ర ప్రజలంతా బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొ న్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.లక్ష్మణరావు, ఎస్.కృష్ణ, దుడ్డుఖల్లు సర్పంచ్ ఎస్.నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు జేఏసీ నేతల వినతి


ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి వినతిపత్రాన్ని అందజేస్తున్న, జేఏసీ నాయకులు

జియ్యమ్మవలస: ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా జేఏసీ నాయకులు తమ సమస్యలపై కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవా ణికి తన నివాసంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల ఆవేదన చెబుదాం అనే కార్యక్రమంలో భాగంగా మన్యం జిల్లా జేఏసీ అధ్యక్షుడు గొట్టాపు శ్రీరామమూర్తి, కార్యవర్గ సభ్యులు కలసి వినతిపత్రం అందజేశారు. ఉద్యో గుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకో వాలని కోరారు. ఇందులో జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీజీ ప్రసాద్, వైస్‌చైర్మన్ ఆర్.రమణమూ ర్తి ఉన్నారు.

మూడు చక్రాల వాహనాల పంపిణీ


లబ్ధిదారులకు మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులకు మూడు చక్రాల వాహనాలను కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చినమేరంగిలోని తన నివాసంలో శుక్రవారం అందజేశారు. పది మం ది లబ్ధిదారులకు రిట్‌రోఫిటెడ్ మూడు చక్రాల మోటర్‌సైకిల్ వాహనములు అందజేశారు. ఈ సంద ర్భంగా పుష్పశ్రీవాణి మాట్లాడుతూ శారీరక అంగవైకల్యం కలిగిన వారికి మోటార్ వాహనాలు పొందడం సంతోషంగా ఉం దన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, పుట్టినరోజు, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాలకొండ / కురుపాం
9951602844, 9010204441
Office mail : vzmadvt@gmail.com